నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 14 సెప్టెంబర్ 2024 RANGAREDDY

## 'పౌష్టికాహార లోపంపై అవగాహన కల్పించండి'

రంగారెడ్డి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 1,600 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 1న ప్రారంభమైన పోషణ్ మాసం కార్యక్రమాన్ని నెలాఖరు వరకు పకడ్బందీగా నిర్వహించాలని, రక్తహీనత, పౌష్టిక ఆహార లోపం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 1,44,000 మంది చిన్నారులు సేవలు పొందుతున్నారని తెలిపారు. పిల్లల ప్రస్తుత బరువు, ఉండాల్సిన బరువు వివరాలను నమోదు చేయాలని, చిన్నారుల్లో అనీమియా రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో పని చేసి పోషణ్ మాసాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి పద్మజా రమణ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డీపీవో సురేశ్‌మోహన్, సీడీపీవోలు, సూపర్ వైజర్లు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 17, 18న మద్యం బంద్




సిటీబ్యూరో, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రెండ్రోజుల పాటు మద్యం షాపులు, కల్లు దుకాణాలు బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేస్తున్నట్లు సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 17న ఉదయం 6 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు.

# కాంగ్రెస్.. నిర్బంధ కాండ

**న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు.. శుక్రవారం సైతం నిర్బంధ కాండను కొనసాగించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను ఎక్కడికక్కడ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో ఉంచారు. కొంతమంది నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటికి ర్యాలీగా వెళ్లి సమావేశం నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన పిలుపుమేరకు పోలీసులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే అక్రమ అరెస్టులకు పూనుకున్నారు. అరెస్టు అయిన బీఆర్ఎస్ నేతలు ఠాణాల్లోనే నిరసనలను కొనసాగించారు. కాంగ్రెస్ సర్కారు నియంతృత్వ ధోరణిపై బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు భగ్గుమన్నారు. అరెస్టులతో అడ్డుకోవడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.**

**- రంగారెడ్డి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ)**

**అక్రమంగా బీఆర్ఎస్ నేతల అరెస్టులు, గృహ నిర్బంధాలు**

- ఠాణాల్లోనే నిరసనలను కొనసాగించిన నేతలు
- శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు
- కాంగ్రెస్ సర్కారు నియంతృత్వంపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు
- అరెస్టులతో అడ్డుకోవడం అప్రజాస్వామికమని మండిపడ్డ బీఆర్ఎస్ నేతలు



అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ కడ్తాల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### భగ్గుమన్న తెలంగాణ వాదులు..

బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరెస్టుల పేరుతో అడ్డుకోవడం అప్రజాస్వామికమని, కాంగ్రెస్ అసంబద్ధ విధానాలపై ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధమేనని తెగేసి చెబుతున్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను అమలు చేస్తున్నారని మండిపడుతున్నారు. కౌశిక్ రెడ్డిపై దాడిచేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేయడం... కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు విధానాలకు నిదర్శనమని పేర్కొంటున్నారు. తెలంగాణలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని కాంగ్రెస్ తీసుకొచ్చిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరిస్తున్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా బుద్ధి చెప్పి తీరుతారని బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణ వాదులు హెచ్చరిస్తున్నారు.

## రెండు రోజులుగా సర్కారు నియంతృత్వం..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు దాడి చేయడంతో గురువారం బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అరికెపూడి గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేయగా పోలీసులు హరీశ్‌రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను అరెస్టు చేసి రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి, కేశంపేట పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ ఎక్కడికక్కడ బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టగా, పోలీసులు వెనక్కి తగ్గి అర్ధరాత్రి విడుదల చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం అరికెపూడి గాంధీ ఇంట్లో సమావేశం నిర్వహించేందుకు తరలిరావాలని కౌశిక్ రెడ్డి, శంభీపూర్ రాజులు పిలుపునివ్వడంతో పోలీసులు మరోమారు జులుం ప్రదర్శించారు. సమావేశానికి వెళ్లేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులపై శుక్రవారం తెల్లవారుజాము నుంచే సర్కారు నియంతృత్వాన్ని ప్రదర్శించింది. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టుల పర్వం కొనసాగింది. దీంతో ఠాణాల్లోనే బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలను కొనసాగించారు. మరోవైపు బీఆర్ఎస్ ముఖ్యనేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని ఆమె నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని నందిగామ మండలం మొదళ్లగూడలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలోని ఆయన స్వగృహంలో నిర్బంధించారు.



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

### ప్రజా పాలన అంటే నిర్బంధాలా ?..



కాంగ్రెస్ ప్రజా పాలన అంటే నిర్బంధాలు చేయడమేనా ? శాంతియుతంగా నిరసన తెలుపాలనుకున్న బీఆర్ఎస్ శ్రేణులను అరెస్ట్ చేయడం ఏమిటీ ?.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకొంటున్న అరికెపూడి గాంధీ ఇంటికి సమావేశం కోసం వెళ్లడానికి ఆంక్షలు ఎందుకు పెడుతున్నారో ప్రభుత్వం చెప్పాలి. నిర్బంధాలు, కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదు. ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేస్తాం. ప్రజలకు వాస్తవ పరిస్థితులు ఏమిటో అర్థమవుతున్నాయి. రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌ను గద్దె దించి బుద్ధి చెబుతాం.

**– మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి**




కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

## ప్రభుత్వానిది పిరికిపంద చర్య

**- ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి**

నందిగామ, సెప్టెంబర్ 13 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం మొదళ్లగూడ గ్రామంలోని ఆయన నివాసంలో నందిగామ సీఐ ప్రసాద్ పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానిది పిరికిపంద చర్య అని ఎమ్మెల్సీ విమర్శించారు. అక్రమ అరెస్టులు, ప్రశ్నిస్తే బెదిరింపులతో పాలనను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



నందిగామ మండలం మొదళ్ల గూడెంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, బీఆర్ఎస్ శ్రేణులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

## ఎక్కడికక్కడ అరెస్టులు

- మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి హౌస్ అరెస్ట్
- మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల గృహ నిర్బంధాలు
- అరెస్ట్‌లపై మండిపడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

వికారాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) 13 : కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో నెలకొన్న వివాదం దృష్ట్యా పోలీసులు వికారాబాద్ జిల్లాలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. కౌశిక్ రెడ్డి ఇంటిపై గాంధీతో పాటు ఆయన అనుచరులు చేసిన దాడికి నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. దీంతో అప్రమత్తమైన జిల్లా పోలీసులు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ శ్రేణులను శుక్రవారం గృహ నిర్బంధాలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు హైదరాబాద్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. జిల్లాలోని కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌లు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. గురువారం అర్ధరాత్రి నుంచే బీఆర్ఎస్ నాయకుల కదలికలను పోలీసులు కనిపెడుతూ వారిని ఎటూ వెళ్లకుండా అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్ట్‌లపై పార్టీ శ్రేణులు, ప్రజాస్వామ్య వాదులు మండిపడుతున్నారు. ఇందిరమ్మ ప్రజా పాలన అందిస్తామని అంటున్న రేవంత్ రెడ్డి సర్కార్ ఎమర్జెన్సీని తలపించేలా ప్రతిపక్ష నేతలను అప్రజాస్వామికంగా నిర్బంధిస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను ఖండిస్తూ జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

### కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు..

పరిగి, సెప్టెంబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ శ్రేణులను అక్రమంగా అరెస్ట్‌లు చేయించడం సరికాదని, రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పరిగి మాజీ ఎమ్మెల్యేను పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించి అర్ధరాత్రి వరకు నిర్బంధించడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన తీరును ప్రజలు గమనిస్తున్నారని,

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



## చేతులెత్తి.. చైర్‌పర్సన్‌ను దించి..

### పెద్దఅంబర్‌పేట చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

### 17 మంది హాజరై.. అవిశ్వాసానికి మద్దతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 13 : పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్‌పై అదే పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానంతో బలం నిరూపించుకున్నారు. చైర్‌పర్సన్ చెవుల స్వప్న తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది. శుక్రవారం మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో ఆర్డీవో అనంతరెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అవిశ్వాస తీర్మానానికి అనుగుణంగా బలపరీక్ష నిర్వహించారు. క్యాంపులకు తరలివెళ్లిన కౌన్సిలర్లు ఉదయం 10.30 గంటలకు నేరుగా సమావేశ మందిరానికి చేరుకున్నారు. సమావేశంలో చైర్‌పర్సన్ స్వప్నపై అవిశ్వాసం కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టగా.. 17 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు తెలిపారు. కోరం సరిపడా ఉండడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు అనంతరెడ్డి వెల్లడించారు. సమావేశానికి సంబంధించిన పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుందని చెప్పారు. అది ఎప్పుడు అనేది పైనుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. అప్పటివరకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్ చైర్‌పర్సన్ వ్యవహరిస్తారని చెప్పారు.

**ఏడుగురు గైర్హాజరు..**

మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉన్నాయి. వీరిలో 17 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉండగా, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. గతనెల కాంగ్రెస్ కౌన్సిలర్ పండుగల జయశ్రీ ఆధ్వర్యంలో 17 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన పత్రాలను అందజేస్తూ కాంగ్రెస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ స్వప్నపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా బలపరీక్ష కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి 17 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డితోపాటు మొత్తం ఏడుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రత్యేక సమావేశానికి హాజరుకాలేదు. కోరం ఉండడంతో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. హాజరైన అందరూ మద్దతు తెలుపడంతో నెగ్గినట్టు ప్రకటించారు. దీంతో నాలుగున్నరేండ్లు నడుస్తున్న అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు ఫుల్‌స్టాప్ పడినట్టయింది. కొత్త చైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీ ఎన్నిక ఇక లాంఛనమే కానున్నది. మున్సిపాలిటీలో సమస్యలు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కొత్త చైర్‌పర్సన్ ఎన్నికను త్వరగా చేపట్టాలని కౌన్సిలర్లు కోరారు.



చేతులెత్తి అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు